తారాబల ప్రకరణము

జన్మ నక్షత్ర మారభ్య దిన నక్షత్ర గణ్యతే /
నవభిస్తు హరేద్భాగం శేషం తారా ఫలాఫలం //

జన్మ నక్షత్రము నుండి దిన నక్షత్రము వరకు లెక్కించి ఆ సంఖ్యను 9 చే భాగించగా వచ్చు శేషము ఆ తారా శుభమో అశుభమో తెలుపును

జన్మసంపద్విపక్షేమ ప్రత్యక్సాధన నైధనం/
మిత్రం పరమమిత్రాచ నవతారాః ప్రకీర్తితాః //

పైన చెప్పిన 9 తారలు వరుసగా 1.జన్మ తర 2.సంపత్ తార 3..విపత్ తార 4.క్షేమ తార 5.ప్రత్యక్ తార 6.సాధన తార 7.నైధన తార 8.మిత్ర తార 9.పరమ మిత్ర తార

జన్మభం దేహ నాశాయ సంపత్సంపదమేవచ /
విపచ్చ కార్య నాశాయ క్షేమం క్షేమ కరీ భవేత్ //
ప్రత్యక్చ కార్య నాశాయ సాధనం కార్య సాధనం /
నైధనం నిధనం స్యాత్ మిత్రం చ సుఖసంపదే/
సుఖాయ పరమం మిత్రం తారాబలమితి క్రమాత్ //

జన్మ తార శరీర నాశనమును, సంపత్ తార సంపత్తిని, విపత్ తార కార్య నాశనమును, క్షేమ తార కుశలమును, ప్రత్యక్ తార కార్య నాశనమును, సాధన తార కార్య సాధనమును, నైధన తార మరణమును, మిత్ర తార సుఖసంపదలను, పరమ మిత్ర తార సౌఖ్యమును కలుగ జేయును.

జన్మర్క్షే సప్తనాడ్యస్స్యు స్త్రిస్రస్తు విపదిస్మృతాః /
ప్రత్యగే నైధనే చాష్టౌ నింద్యాశ్శేషాః శుభావహాః //

జన్మ తారకు 7 ఘడియలు, విపత్తారకు 3 ఘడియలు, ప్రత్యక్తార, నైధనతారలకు 8 ఘడియలు అశుభములుగా చెప్పబడినవి. మిగిలిన ఘడియలు శుభప్రదమైనవి. 7 ఘడియలు అనగా 2 గంటల 48 నిమిషాలు, 3 ఘడియలు అనగా 1 గంట 12 నిమిషాలు, 8 ఘడియలు అనగా 3 గంటల 12 నిమిషాలు. ఆ యా నక్షత్రాల ఆరంభం నుండి పై సమయాలు వదలగా తక్కిన సమయాలు శుభప్రదములు

జన్మ త్రి పంచ సప్తాఖ్యా స్తారానేష్టఫల ప్రదాః/
తద్దోష పరిహారాయ దద్యాదేత ద్విజాతయే /
శాకం గుడంచ లవణం సతిలం కాంచనం క్రమాత్ //
విపది ప్రత్యగే చైవ చరమం చాద్యకం వినా /
స్వోచ్చ స్వర్క్ష గతశ్చంద్ర శుభదస్సర్వ కర్మసు //

జన్మ, మూడవ, ఐదవ, ఏడవ తారలు అంటే జన్మ తార, విపత్తార, ప్రత్యక్ తార మరియు నైధన తార అశుభ ఫలితములు ఇచ్చేవి అయినందువల్ల ఆ దోష పరిహారమునకు వరుసగా అంటే జన్మ తారకు శాకమును (కూరగాయలను), విపత్తారకు బెల్లమును, ప్రత్యక్ తారకు ఉప్పును మరియు నైధన తారకు నువ్వులతో సహా బంగారమును బ్రాహ్మణునకు దానమీయవలెను. జన్మ నైధన తార వినా తక్కిన విపత్తార ప్రత్యక్తార లందు ఉచ్చ స్వనక్షత్ర ములయందున్న చంద్రుడు అన్ని శుభ కర్మలయందు శుభప్రదుడు అగును.